ప్రజాశక్తి

శనివారం 20 డిసెంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

'ఉపాధి' చట్టాన్ని

నిర్వీర్యం చేసే కుట్ర

- గ్రామీణ ఉపాధిని దక్కించుకునేందుకు ఐక్య ఉద్యమం తప్పదు..
- ధర్నాలో సిపిఎం నేతల పిలుపు..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సిపిఎం ధ్వజమెత్తింది. ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ సిపిఎం జిల్లా కమిటీ నేతృత్వంలో శుక్రవారం ఒంగోలు బాపూజీ మార్కెట్ వద్ద నోటికి నల్ల రిబ్బన్లు ధరించి.. ధర్నా కార్యక్రమం చేపట్టారు. పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు మాట్లాడారు. వామపక్షపార్టీల ఉద్యమాల ఫలితంగా యుపిఎ ప్రభుత్వం 2005లో గ్రామీణ పేదల కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. మోడీ అధికారం చేపట్టిన ▶ 3లో

వ్యవసాయంపై

సమగ్ర దృష్టి లేకనే.!

- స్థూల ఉత్పత్తిలో వ్యవసాయం నుంచి తగ్గిన ఆదాయం
- ఏ పంటకూ ధరల్లేకనే రైతులు నష్టాల పాలవుతున్నట్లు స్పష్టం
- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తీసుకున్న చర్యలు పూజ్యం
- కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వ గణాంకాల్లోనే ఇది తేటతెల్లం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఈ ఏడాది స్థూల ఉత్పత్తి లక్ష్యసాధనలో జిల్లాకు 15వ స్థానం దక్కింది. ఇప్పటికే వెనుకబాటు జిల్లాగా ఉన్నప్పటికీ ఇదే తీరు కొనసాగుతోంది. అభివృద్ధి ముందడుగు కనిపించడం లేదు. ఇది జనాభా తప్పిదం కాదు. పాలకుల పుణ్యమే.! రెండు రోజుల పాటు జరిగిన కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు అన్ని రకాల గణాంకాలు వెల్లడించారు. సమీక్షలు నిర్వహించారు. అభివృద్ధి.. వెనుకబాటుపై సమీక్ష చేశారు. అందులో జిల్లా ఎక్కడుందన్నదీ తేటతెల్లమైంది. మనం 15వ స్థానంలో ఉన్నాం. పర్వాలేదనుకోవాలా? ఇంకా మన తర్వాత చాలా జిల్లాలున్నాయనుకుని సంబరపడాలా? అనేదీ ఆలోచించాలి. అయితే ఇక్కడ లోతుగా ఆలోచించాల్సిన విషయం ఒక్కటే. వ్యవసాయం నుంచి ఉత్పత్తి.. తద్వారా ఆదాయం తగ్గాయి. ఫలితంగా స్థూల ఉత్పత్తిపైనా ప్రభావం చూపింది. జిల్లాలో వ్యవసాయం నుంచి రాబడి రూ.24,544 కోట్లు అంచనా వేశారు. తొలి అర్ధ సంవత్సరంలో రూ.6,729 కోట్లు వచ్చినట్లు గణాంకాల్లో పేర్కొన్నారు. అంటే 27.42 శాతంగా ఉంది. అంటే ఎంత వెనుకబాటు ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. ఇందుకు కారణం వ్యవసాయంపై సమగ్ర దృష్టి లేకపోవడమే.! వ్యవసాయం లాభసాటిగా మార్చే చర్యలు ఏ ఒక్కటీ చేపట్టకపోవడమే.! జాతీయ సంయుక్త కిసాన్‌మోర్చా నేతలు నెలకు రెండు సార్లు మీడియా సమావేశాలు పెట్టి వ్యవసాయం సంక్షోభం వైపు పయనిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధరల్లేవని.. ఏ పంట వేస్తే గిట్టుబాటు ధరలు కల్పిస్తారో రైతులకు స్పష్టంగా చెప్పాలంటూ పదేపదే కోరుతున్నారు. ఆచరణలో ఏ పంటకూ ▶ 2లో



ఎస్పీలు దామోదర్, హర్షవర్ధన్‌రాజుకు అవార్డు అందజేస్తున్న డిజిపి

'ప్రకాశం' పోలీసు శాఖకు

ఏబీసీడీ అవార్డు

▶ 8లో



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రులు స్వామి, గొట్టిపాటి రవికుమార్



ఖోఖో పోటీల ప్రారంభం సందర్భంగా మార్చ్ పాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

మంచి క్రీడాకారులుగా తయారవ్వాలి..

- శాప్ చైర్మన్ రవినాయుడు
- రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పంగులూరు

విద్యార్థులు బాగా చదువుకోవాలని, బాగా ఆటలు కూడా ఆడుకోవాలని, మంచి క్రీడాకారులుగా తయారవ్వాలని ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. 44వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీల ప్రారంభం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో క్రీడాకారులకు మూడు శాతం ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించామన్నారు. దాని ఫలితంగానే ఇటీవల మెగా డీఎస్సీలో పరీక్ష రాయకుండా డైరెక్ట్‌గా ఖోఖో క్రీడాకారులకు 30 మందికి ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. ఇక నుండి ప్రతి క్రీడలో క్రీడాకారులకు మూడు శాతం ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇటీవల జారీ చేసిన ఫారెస్ట్ ఉద్యోగాలు 600లో 41 ఉద్యోగాలు క్రీడాకారులకు రాబోతున్నాయని చెప్పారు. గ్రామీణ క్రీడలను కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తుందని, ఖో ఖో క్రీడను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో రూ.19 కోట్ల 30 లక్షల రూపాయలు క్రీడాకారులకు బకాయిలు ఉన్నాయని, వాటిలో చాలావరకు క్రీడాకారులకు ఇచ్చామని, మార్చి నాటికి ▶ 2లో

ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు

- విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- నియోజకవర్గంలో ఉచితంగా 5,542 సైకిళ్ల పంపిణీ
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-బల్లికురవ

సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా, ప్రతి పాఠశాలలోనూ మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. మండలంలోని వైదన గ్రామంలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామితో కలిసి పలు అభివద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రూ.73 లక్షలతో ఆధునీకరించిన సాంఘిక, సంక్షేమ బాలుర వసతిగహాన్ని ప్రారంభించారు. సెమీ క్రిస్మస్ కేకును కట్ చేసి.. పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ కాలువలు ప్రారంభించారు. మండల పరిషత్ పాఠశాల్లో రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడ ప్రారంభించారు. రూ.50 లక్షలు దాతల సహకారంతో నిర్మించిన ముస్లిం కమ్యూనిటీ హాలు ప్రజలకు అంకితం చేశారు. వైదన జెడ్పి ఉన్నత పాఠశాల్లో 199 మంది విద్యార్థులకు దాతల సహాయంతో ఉచితంగా సైకిళ్లను అందజేశారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. దూరం ఎక్కువగా ఉండే కారణంతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని ఇప్పటి వరకు నియోజకవర్గంలో 5,542 మంది విద్యార్థినీ, విద్యార్థులకు దాతలు ఎస్‌ఆర్‌ఆర్, అసిస్ట్ సేవా సంస్థ నిధులతో సైకిళ్లను ఉచితంగా అందించామని తెలిపారు. రాజకీయాలకు సంబంధం లేకుండా, ▶ 2లో

వ్యవసాయంపై సమగ్ర దృష్టి లేకనే.!

(మొదటిపేజీ తరువాయి)

గిట్టుబాటు ధర లేదు. ఈ తరుణంలో వ్యవసాయం నుంచి రావాల్సిన రాబడి..ఆదాయం తగ్గాయి. జిల్లా స్థూల ఉత్పత్తిపైనే ప్రభావం చూపాయి. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లేదు. కిలోకు సగటు ధర రూ.242 వచ్చింది. బ్యారన్‌కు కనీసం రూ.రెండు లక్షలు నష్టం వచ్చినట్లు అంచనా. పొగాకు జిల్లాలోనే కాకుండా రాష్ట్రస్థాయిలోనే అత్యధికంగా ఇక్కడే పండుతోంది. మొత్తం సిగరెట్ పరిశ్రమ దీనిపైనే ఆధారపడింది. ఐటీసీ ఎదుగుదలకు, దాని వ్యాపార కార్యకపాలాలకు జిల్లా పొగాకు రైతులే కారణం. ఇంతటి ప్రాధాన్యత ఉన్నా ఇక్కడ పొగాకు రైతులను కాపాడుకునే యత్నం చేయడం లేదు. సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నారు. వేలంపై ప్రభుత్వాలకు నియంత్రణ గానీ, పర్యవేక్షణ గానీ లేదు. వ్యాపారుల ఇష్టారాజ్యానికే వదిలేశారు. మరో వాణిజ్య పంటగా ఉన్న శనగ పంటకూ గిట్టుబాటు ధరల్లేవు. విదేశాల నుంచి దిగుమతుల వల్ల దీని ధర పడిపోయింది. క్వింటా రూ.5 వేలకు కూడా కొనే పరిస్థితి లేదు. కనీస మద్దతు ధర కూడా అమలు కావడం లేదు. ఇప్పటికీ 12 నుంచీ 14 లక్షల క్వింటాళ్ల శనగలు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్నాయి. మొక్కజొన్న విషయానికి వస్తే అమెరికా నుంచి మొక్కజొన్నలను దిగుమతి చేసుకునేందుకు తాజాగా ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో ఇక్కడ ధరలు పడిపోయాయి. రైతులు నష్టపోతున్నారు. పత్తి, మిర్చి ఇలా అన్ని రకాల వాణిజ్య పంటలకు ధరల్లేక రైతులు నష్టపోతున్నారు. కూరగాయల పంటల పరిస్థితీ మరీ అధ్వానం. బాగా పండితే కిలో రూపాయికే అమ్మాలి. నిల్వ చేసే పరిస్థితి లేక రైతులు పొలాల బయటే కూరగాయలు పారేస్తున్న దృశ్యాలను ఎన్నో చూస్తుంటాం. కొన్ని సంబర్భాల్లో కిలో వందకుపైగా అమ్ముతున్నారు. ఇలా ఒడిదుడుకులకు కారణం పంటల ఉత్పత్తుల నిల్వచేయడం, మార్కెటింగు వ్యవస్థలను పటిష్టం చేయలేకపోవడమే.. ఇలా వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయాలు తగ్గిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు ఎక్కడ వెనుకబాటు ఉందో స్పష్టంగా గుర్తించాలి. కీలకమైన వ్యవసాయంలో రాబడి తగ్గినందున వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.

మంచి క్రీడాకారులుగా తయారవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

మిగతా బకాయిలు మొత్తం చెల్లిస్తామని రవి నాయుడు చెప్పారు. దేశంలో మొట్టమొదటిసారిగా చంద్రబాబునాయుడు గచ్చిబౌలిలో నేషనల్ గేమ్స్‌కు అవసరమైన కోర్టులు నిర్మించాడని, ఈ రోజు అక్కడ జాతీయ, అంతర్జాతీయ క్రీడలు కూడా జరుగుతున్నాయని చెప్పారు. చంద్రబాబుకు క్రీడల పట్ల మక్కువ ఉందని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆయన వెనుకాడడని అన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని, దీని ప్రకారం ఒలంపిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధిస్తే ఏడు కోట్ల రూపాయల బహుమతితో పాటు ఐఎఎస్ ఉద్యోగం కూడా ఇస్తామని హామీ ఇచ్చామని అన్నారు. ఇంకా రకరకాల మెడల్స్ సాధించిన వారికి కూడా మంచి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. విద్యార్థులు చదువును బాధ్యతగా చదవాలని, చదువుతోపాటు ఆటలు కూడా ఆడి, జాతీయ, అంతర్జాతీయ, కామన్వెల్త్ క్రీడాకారులుగా తయారు కావాలని కోరారు. గత 305 సంవత్సరాల నుండి పంగులూరు గ్రామంలో అకాడమీ ఏర్పాటు చేసి పట్టుదలతో, కృషితో, క్రమశిక్షణతో, నిర్వహిస్తూ వందలాది మంది క్రీడాకారులను తయారుచేసిన నిర్వాహకులకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రకాశం జిల్లా అంటే ఖో ఖో క్రీడ గుర్తుకొస్తునట్లుగా ఇక్కడ నిర్వాహకులు ఈ క్రీడకు ప్రాధాన్యత ఇచ్చారని, మంచి గుర్తింపు తెచ్చారని కొనియాడారు. అంతకుముందు జాతీయ పతాకాన్ని రవి నాయుడు, రాష్ట్ర క్రీడా పతాకాన్ని మాజీ శాసనసభ్యులు బాచిన చెంచు గరటయ్య, జిల్లా క్రీడా పతాకాన్ని మేకల సీతారాంరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం జాతీయ క్రీడాకారులు క్రీడాజ్యోతిని రవి నాయుడుకి అందజేశారు. రవి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు బాచిన చెంచు గరటయ్య, బాపట్ల డిఎస్డివో శ్రీనివాసరావు, శాప్ డైరెక్టర్ సంతోష్ కుమార్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ బాబు, రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, కార్యదర్శి రాగిణి రామారావు, మాజీ జెడ్పిటిసి కరి వెంకటసుబ్బారావు, రాయిని వెంకట సుబ్బారావు, ఖో ఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హనుమంతరావు, వైస్ ప్రెసిడెంట్ గిరి ప్రసాద్, ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మేకల సీతారామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఉష సీతారామిరెడ్డి, ప్రకాశం డిఎస్డివో రాజరాజేశ్వరి, జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, కుర్ర భాస్కరరావు, ధనుంజయ, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడా వెబ్‌సైట్ ప్రారంభం

సభలో ఖోఖో క్రీడా వెబ్ సైట్‌ను శాప్ చైర్మన్ రవి నాయుడు ప్రారంభించారు. ఈ వెబ్సైట్లో ఖోఖో క్రీడకు సంబంధించిన క్రీడాకారుల వివరాలు, ఆటకు సంబంధించిన వివరాలు, ఎక్కడెక్కడ ఖో ఖో ఆటలు జరిగాయి. ఫలితాలు ఎలా వచ్చాయి.. అనే వివరాలు ఉంటాయని రవి నాయుడు తెలిపారు.

బీసీలు ఎప్పటికీ నా గుండెల్లోనే: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గిద్దలూరు: గిద్దలూరులో బీసీ వర్గాల సంక్షేమానికి తన వంతు కృషి ఎప్పటికీ కొనసాగుతుందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంఘ మహిళా ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత నేతృత్వంలో పలువురు బీసీ నాయకులు శుక్రవారం గిద్దలూరులో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంతంలో బీసీ వర్గాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో నివసిస్తున్నప్పటికీ, ప్రస్తుతం సామూహిక సమావేశాలు, సంక్షేమ కార్యక్రమాలు, విద్యా అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు సరైన భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గిద్దలూరులో బీసీ భవన్ ఏర్పాటు చేస్తే బీసీ యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. బీసీ భవన నిర్మాణానికి రూ.30 లక్షలు సీఎస్ఆర్ నిధుల ద్వారా మంజూరు చేయిస్తున్నానని, త్వరలోనే భవన నిర్మాణం ప్రారంభమవుతుందని హామీ ఇచ్చారు.

ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ నాయకుల పేర్లు, పార్టీ గుర్తులు లేకుండా విద్యార్థులందరికీ యూనిఫాంలు, బ్యాగులు, పుస్తకాలతో పాటు షూలు కూడా పంపిణీ చేశామన్నారు. టీచర్ల కొరత తీర్చేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు మెగా డిఎస్సీ ద్వారా ఒకేసారి 16,300 ఉపాధ్యాయ పోస్టులను కూటమి ప్రభుత్వంలో భర్తీ చేశామని వెల్లడించారు. పిల్లలు అందరూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని మంత్రి గొట్టిపాటి ఆకాంక్షించారు. వార్డెన్లు అందరూ విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని హితవు పలికారు. వైదనలో అంగన్‌వాడీ సభ్యులకు మంత్రులు గొట్టిపాటి, డోలా 5జీ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ సాంఘీక, సంక్షేమ హాస్టళ్ల అభివద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎస్సీ హాస్టల్స్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. పెన్షన్లు, ఉచిత బస్, రైతుకు ఆర్థిక సహాయం, పిల్లల చదువులకు చేయూత వంటివి ఎన్నో చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ రహదారులు అభివద్ధి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రోడ్లను దమ్ము ట్రాక్టర్లతో తొక్కించేస్తున్నారని, దీనితో సంవత్సరానికే రోడ్లు ధ్వంసం అవుతున్నాయని మంత్రి గొట్టిపాటి అసహనం వ్యక్తం చేశారు. వాటికి రబ్బరు తొడుగులు వేసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివద్ధితో పాటు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసం గురించి కూడా ప్రజలు ఆలోచించాలని మంత్రి గొట్టిపాటి కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోటి సంతకాల పేరుతో దొంగ సంతకాలు


టిడిపి మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు

ప్రజాశక్తి -మద్దిపాడు

కోటి సంతకాల సేకరణ పేరుతో వైసిపి దొంగ సంతకాలు సేకరించడం హాస్యాస్పదమని, అది వారి నిరంకుశ వైఖరికి నిదర్శనమని టిడిపి మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీలు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మించడంను వ్యతిరేకిస్తూ వైసిపి కోటి సంతకాలు సేకరించడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. 2024లో పిపిపి విధానంలో పార్లమెంటు స్థాయి సంఘంలో సభ్యుడైన ఆ పార్టీ ఎంపీ గురుమూర్తి జగన్మోహన్ రెడ్డికి శిష్యుడని అప్పట్లో పిపిపి విధానానికి మద్దతు పలికినట్లు తెలిపారు. కానీ ఈరోజు మెడికల్ కళాశాల నిర్వహణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పేరుతో దొంగ సంతకాలు సేకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పిపిపి విధానంలో మెడికల్ కళాశాలలో నిర్వహించే వారిని తాము అధికారంలోకి రాగానే జైలులో వేస్తానని ఆయన చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి అడక స్వాములు, బాపట్ల పార్లమెంట్ వ్యవసాయ వ్యవసాయ సంఘం నాయకులు రావిపాటి శ్రీనివాస్, దుగ్గినేని నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కడియాల రఘుబాబు, రైతు సంఘం నాయకుడు రావి వెంకటేశ్వర్లు, పొదిలి రాంబాబు, కుంచాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప్పుగుండూరు నాగేశ్వరరావు



నివాళులర్పిస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

బైకును గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఇంకొల్లురోడ్డులో ఆక్రిడ్జ్ హైస్కూలు సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మండల పరిధిలోని కండ్లగుంట గ్రామానికి చెందిన అత్తంటి కోటేశ్వరరావు(50) అనే వ్యక్తి మృతిచెందాడు. మృతుడు బైకుపై నాగులప్పలపాడు నుంచి తమ స్వగ్రామమైన కండ్లగుంట వెళ్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వెళ్లేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రైవేటు వాహనంలో ఒంగోలు రిమ్స్ తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే కోటేశ్వరరావు మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. డిడిపి నాయకులు కోటేశ్వరరావు మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన టిడిపి మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్,పున్నారెడ్డి, రాంబాబు ఉన్నారు. నాగులుప్పలపాడు ఎస్ఐ రజియా సుల్తానా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉపాధి' చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

కొత్తలోనే ఈ చట్టం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన వైనాన్ని గుర్తుచేస్తూ, చట్టానికి వక్రభాష్యం పలుకుతున్నారని దునుమాడారు. కేవలం ఈ చట్టం వ్యవసాయ కూలీలకు ఉపాధి మాత్రమే కాదని, ఈ చట్టం అమలు కారణంగా దేశవ్యాప్తంగా సాగునీరు, తాగునీరు వనరులు అభివృద్ధి చెంది, వ్యవసాయం అభివృద్ధి చెందడం, అనుబంధ పరిశ్రమలు ఏర్పడటం తద్వారా దేశంలో పేద ప్రజల కొనుగోలు శక్తి పెరిగి సంపద సృష్టించిన వైనాన్ని ఈ సందర్భంగా మాబు విశ్లేషణ చేశారు. పథకం ద్వారా చెక్ డ్యామ్ లు, చెరువులు కుంటలు అభివృద్ధి చెంది.. ఎంతో మంది చిన్న, సన్నకారు రైతులు ప్రయోజనం పొందినట్లు గుర్తు చేశారు.ఇప్పటివరకు అమలులో వున్న నిబంధనలు ప్రకారం 10 శాతం నిధులు చెల్లించలేని రాష్ట్రాలు కేంద్రం నిర్దేశించిన 40 శాతం నిధులు ముందస్తుగా జమ చేసే పరిస్థితుల్లో ఉన్నాయా.? అని ప్రశ్నించారు. ఈ చర్యలు కారణంగా రాష్ట్రాలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని హెచ్చరించారు. ఈ పాటికే రూ.లక్షల కోట్లు అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ చర్యలపై నోరు మెదపక పోవడం వెనుక పేదల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి అగుపిస్తోందని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీని హత్యగావించిన ఆర్ఎస్ఎస్ శక్తులు ఆయన స్వాతంత్ర ఉద్యమ చరితను కూడా రూపుమాపేందుకు మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం పేరు మార్చే కుట్రగా విమర్శించారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్లకు సేవచేసే సంస్థగా మారినట్లు ఆరోపించారు. కేంద్రంతో పాటు రాష్ట్రాల్లో ఉన్న అధికారాలను ఉపయోగించుకుని రాజ్యాంగ విధ్వంసం సృష్టించడంతో పాటు మనువాదం అమలుకు తీవ్రంగా క షి చేస్తుందని ధ్వజమెత్తారు. కార్మిక చట్టాలు, నేర చట్టాలు, సహకార చట్టాలను, మహిళా రక్షణ చట్టాలను పూర్తి స్థాయిలో మార్పి వేసి నిర్వీర్యం చేస్తున్నట్లు మండిపడ్డారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ వలసలు నిలువరించేందుకు, పేదలకు ఉపాధి కల్పించే లక్ష్యంగా యుపిఏ ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వివిజిఆర్ఎంజి పేరున నిర్వీర్యం చేసే చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందబోయే లోపు ప్రజలు ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, పార్టీ సీనియర్ నాయకులు పమిడి వెంకటరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి బాలకోటయ్య, కంకణాల రమాదేవి మాట్లాడారు. తొలుత బాపూజీ మార్కెట్ లో గాంధీ విగ్రహానికి పార్టీ కార్యదర్శి మాబు పూలమాల వేసి.. నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జాలా అంజయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి కల్పన, ఉబ్బా ఆదిలక్ష్మి, బి రఘురామ్, కె జి మస్తాన్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి రమేష్, టి మహేష్, కొర్నెపాటి శ్రీనివాసరావు నాయకులు ఎస్ వీరస్వామి, టి భక్త సింగ్ రాజు, జి శేషయ్య, సి హెచ్ రాంబాబు, సిహెచ్ లక్ష్మీనారాయణ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు అమూల్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కనిగిరి

అంగన్‌వాడీల సేవలు సమాజానికి ఎంతో కీలకమని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లోకనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు పోషణ్ ట్రాకర్ యాప్ డైలీ అప్‌డేట్స్ కోసం 5జీ స్మార్ట్‌ఫోన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంరక్షణలో అంగన్‌వాడీల పాత్ర అమూల్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీలకు ఉద్యోగ విరమణ అనంతరం రూ.1 లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్ కలిపించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిడిపిఒ సరోజిని, సూపర్‌వైజర్లు పార్వతి, జరీనా, పద్మజ, ధనలక్ష్మి, మల్లేశ్వరి, సుమతి, కోఆర్డినేటర్ అశ్విని, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

బిజెపి కుట్రలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి సిఎస్‌పురం రూరల్

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పొదిలి నరసింహులు కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మారుస్తూ పార్లమెంటులో బిల్లును ఆమోదించడాన్ని నిరసిస్తూ ఉపాధి కూలీలు శుక్రవారం జీవో పత్రులను దహనం చేశారు. చేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ మారిన చట్టం ప్రకారం ఉపాధి హామీకి నిధులు పూర్తిగా తగ్గిపోతాయని తెలిపారు. రాష్ట్రాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందన్నారు. రైతులకు కూడా తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండలరావు, కోనమ్మ, తిరుపతమ్మ, చిరంజీవి, కూలీలు పాల్గొన్నారు.

పామూరు : ఉపాధి హామీచట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ హెచ్చరించారు. సిఎస్‌పురంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి సిపిఎంనాయకుల విటల్ రావు పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆనీఫ్ మాట్లాడుతూ పేదల కోసం సిపిఎం ఎంపీలు కేంద్రంలో పోరాటం చేసి ఉపాధి హామీ చట్టాన్ని సాధించిన్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, గౌస్‌బాషా, పందిటి శీను, శ్రీనివాసులు, ఎం రామయ్య, యాట వీరనారాయణ, సిహెచ్. వెంకటేశ్వర్లు, షేక్ మహవీర, సిపిఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జీవో కాపీలను దహనం చేస్తున్న కూలీలు

అష్ఫాఖుల్లా ఖాన్ ఆశయాల కోసం పనిచేయాలి

ప్రజాశక్తి -పామూరు

అష్ఫాఖుల్లా ఖాన్ ఆశయాల కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ తెలిపారు. అష్ఫాఖుల్లా ఖాన్ 102వ వర్ధంతిని స్థానిక పప్పు వెంకోబరావు మీటింగ్ హాలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ అష్ఫాఖుల్లాఖాన్ బాల్యంలో మంచి విప్లవ నాయకుడని గుర్తు చేశారు. అష్ఫాఖుల్లాఖాన్ తన స్నేహితుడు హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ నాయకుడు రాంప్రసాద్ బిస్మిల్లాను ఉరిశిక్ష నుంచి రక్షించిన గొప్ప నాయకుడు అని తెలిపారు. దేశం కోసం మొట్టమొదట ప్రాణత్యాగం చేసిన గొప్ప వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఖాదర్ బాషా, పంది శ్రీను, యాటా వీరనారాయణ సయ్యద్ గౌస్‌బాషా పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి సచివాలయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డి గంగాధర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమస్యపై అర్జీలు అందజేసేందుకు అర్జీదారులతో ఎపిడిఒ మాట్లాడారు. వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడిపాటిపల్లి ఎస్‌సి కాలనీలో ఓ ప్రభుత్వ బోరును అక్రమంగా వినియోగించుకుంటున్నట్లు తెలుసుకొని అక్కడ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వ బోర్లు , బావులు, చేతి పంపులను ఎవరైనా ఆక్రమంగా వినియోగించుకుంటే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు రాంప్రసాద్, జనార్ధన్ రావు సచివాలయ సిబ్బంది బోర్ మెకానిక్ మునిరాజ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ప్రజాశక్తి-శింగరాయకొండ : 104 వాహన సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ధీరేంద్ర కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు అడకా శ్రీకాంత్ మాట్లాడుతూ భవ్య యాజమాన్యం 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. భవ్య యాజమాన్యం 7 నెలలుగా సిబ్బంది పే స్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. క్యాజువల్ సెలవులు ఇచ్చేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు చేస్తున్న 104 సిబ్బందికి పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలన్నారు. వాహనాల్లో మందులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం సభ్యులు అంజయ్య మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

సిపిఎం సీనియర్ సభ్యులు అల్లడి అంజయ్య (85) శుక్రవారం మృతి చెందారు. అద్దంకి మండలం విప్పర్లవారి పాలెంకు చెందిన ఆయన 35ఏళ్ల నుండి సిపిఎంలో పని చేస్తూ అనేక బాధ్యతలు నిర్వహించారు. మేదరమెట్ల శాఖ కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యునిగా పనిచేశారు. మేదరమెట్లలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించే విషయంలో చురుకుగా పనిచేసి ఇళ్ల స్థలాలు ఇప్పించారని సిపిఎం కోరిసపాడు మండల కార్యదర్శి ఎం ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా అంజయ్యకు నివాళి అర్పించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజానాట్య మండలి బాధ్యులు బొంతు దశరథ, వై రవీంద్రబాబు, డి మాణిక్యరావు, సేవా కోటేశ్వరరావు, డి జయమ్మ, అల్లటి సుబ్బారావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆర్టీసీ ఫెడరేషన్ నాయకులు

పెట్రోల్ బంక్‌లో అవినీతిపై విచారణ జరిపించండి

ప్రజాశక్తి - బాపట్ల

ఏలూరు ఆర్టీసీ డిపోకు చెందిన పెట్రోల్ బంక్ అవుట్లెట్‌లో జరిగిన అవినీతి కుంభకోణంలో అసలు దోషులను గుర్తించడానికి జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, అవినీతితో సంబంధంలేని ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని కోరుతూ ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం కుమార్ మాట్లాడుతూ అవినీతితో సంబంధ లేని ఉద్యోగులను బాధ్యులు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీసీ అధికారులు సస్పెండ్ చేయడం అన్యాయమని అన్నారు. ఆయిల్ బంకు నిర్వహణకు సమగ్ర విధానం రూపొందించకుండా ఉద్యోగులకు విధులు కేటాయిస్తూ ఎటువంటి వ్రాతపూర్వక ఆదేశాలు లేకుండా సస్పెన్షన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దశాబ్దాల చరిత్ర గల ఆర్టీసిలో అవినీతి జరిగితే డబ్బులు చెల్లిస్తే సస్పెండు లేదని, కట్టకపోతే సస్పెండు చేస్తామని బెదిరింపులతో కొంతమంది అధికార్లు అంటున్నారని అన్నారు. నిర్దోషులపై సస్పెండ్ ఎత్తివేసి సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన శిక్షలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉయ్యూరు శ్రీనివాసరావు, భోగిరెడ్డి తిరుమలరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, జి సత్యనారాయణ పాల్గొన్నారు.


ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న వీర శివలీల

ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహంలో ఉంటూ చదువుకుంటూ భారతీయ వైమానిక దళం (ఇండియన్ ఎయిర్ ఫోర్స్)లో ఉద్యోగం సాధించినట్లు బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. కళాశాల విద్యార్థుల వసతి గృహంలోని విద్యార్థి సిహెచ్ హర్షవర్ధన్ వైమానిక దళంలో ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సాధికారత అధికారి జి వీర శివలీల విద్యార్థి హర్షవర్ధన్‌ను అభినందించారు.

పేదల కడుపు కొట్టడానికే ఉపాధి చట్టం సవరణ



బాపట్లలో గాంధీ విగ్రహం వద్ద సిపిఎం నిరసన


చీరాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను రద్దు చేస్తూ ఉపాధిని హరించే 'జీ రామ్ జీ' అనే నూతన బిల్లు లోక్‌సభలో బలవంతంగా ఆమోదింపజేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య తీవ్రంగా విమర్శించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం, గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు, కూలీలకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేసిన ఘోర నమ్మక ద్రోహమని అన్నారు. ఇది దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజని తెలిపారు. ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎవరి దయ మీద వచ్చిన పథకం కాదని అన్నారు. ప్రజల పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టబద్ధమైన ఉపాధి హక్కు అన్నారు. పని అడిగితే పని ఇవ్వాలనే బాధ్యతను ప్రభుత్వంపై మోపిన చట్టమని, అలాంటి హక్కు ఆధారిత చట్టాన్ని రద్దు చేసి ఉపాధిని కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా ఇచ్చే భిక్షగా మార్చడం ఈ బిల్లు అసలు ఉద్దేశ్యమన్నారు. పార్లమెంటులో చర్చ లేకుండా ప్రజాస్వామ్య సాంప్రదాయాలు తుంగలో తొక్కుతూ ఆమోదించడం దుర్మార్గమని అన్నారు. ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం సైతం ఇవ్వలేదన్నారు. సెలక్ట్ కమిటీకి పంపాలన్న డిమాండ్‌ను తిరస్కరించడం పూర్తిగా నియంతృత్వ పద్ధతిలో చట్ట నిర్మాణం చేసినట్లేనని అన్నారు. ధర్నా అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి కృష్ణమోహన్, సిహెచ్ మజుందర్, పి కొండయ్య, కె శరత్, నూతలపాటి కోటేశ్వరావు, కె నాగేశ్వరావు, వై భాస్కరరావు, టి సుభాషిని పాల్గొన్నారు.

చీరాల : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్ట స్ఫూర్తిని దెబ్బతీస్తూ చేపడుతున్న పేరు మార్పులు ఆ చట్టాన్ని నిర్వీర్యం చేయటమేనని, దీనిని సిపిఎం వ్యతిరేఖిస్తుందని సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పేరు మార్పును వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కొట్ల బజార్‌లోని తెల్ల గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఉపాధిని హక్కుగా కల్పించే ఉపాధి హామీ చట్టాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఉపాధిని హక్కుగా కాకుండా ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పథకంగా మార్చే కుట్ర జరుగుతోందని అన్నారు. ఎక్కడ పనులు ఉంటే అక్కడే పథకం వర్తించేలా మార్పులు చేయడం ద్వారా చట్ట సారాంశాన్ని దెబ్బతీస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయించగా తాజా మార్పులతో కేంద్రం వాటా 60 శాతంకు తగ్గించి మిగిలిన భారం రాష్ట్రాలపై మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్పులు అమల్లోకి వస్తే రాష్ట్రానికి రూ.7 వేల కోట్ల వ్యయం ఉండగా అందులో రూ.2,800 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వం మోయాల్సి వస్తుందని వివరించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును వికసిత్ భారత్ పేరుతో మార్చి మత రంగు పులిమే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం వసంతరావు, హైవే ప్రసాద్, జి ఇమాన్యుల్, పి శ్రీనివాసరావు, డి మోషే, యు సాంబయ్య, గోపి, రాంబాబు, సింహాచలం పాల్గొన్నారు.

అద్దంకి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసిన కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు ఆసరాగా ఉన్న చట్టాలను ఒక్కొక్కటిగా కేంద్రంలోని బిజెపి రద్దు చేస్తుందని అన్నారు. కార్మిక చట్టాలు రద్దుచేసి లేబర్ కోడ్ బిల్లు తీసుకొచ్చి కార్మిక హక్కులు కాలరాసిందని అన్నారు. నేడు గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఆసరాగున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కూలీల పొట్టకొట్టిందని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వింత పత్రాన్ని డిప్యూటీ తహశీల్దారు సురేష్ బాబుకు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె కరీమ్, కోమరగిరి ప్రమీల, హనుమంతరావు, జ్యోతి పాల్గొన్నారు.

రేపల్లె : మహాత్మాగాంధీ పేరు మారుస్తూ వ్యవసాయ కార్మికులకు నష్టం చేసే ఉపాధిహామీ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని గాంధీ బొమ్మ వద్ద సీపీఎం కార్యకర్తలు నిరసన తెలిపారు. ఇసుకపల్లి గాంధీ బొమ్మవద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరిగినా నిరసనలో సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడారు. వ్యవసాయ కార్మికులు, పేద రైతులకు ఆత్మస్థైర్యాన్ని ఇస్తూ అనేక మందికి ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టం 2005ను రద్దు చేసి దాని స్థానంలో వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజుగార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె ఆశీర్వాదం, కె గోపి, డి అగస్టిన్, కె రమేష్, జి దానియేలు, ఐద్వా నాయకురాలు కె నాంచారమ్మ, వై ధనమ్మ, ఎస్‌కె షకీరా పాల్గొన్నారు.

ముండ్లమూరు : ఉపాధి హామీ చట్టం సవరణతో కేంద్రప్రభుత్వం పేదల పొట్ట కొడుతుందని సిపిఎం కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు ఆరోపించారు. స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంట ఏడుకొండలు, సత్యం, మీరావలి, నారాయణ, రామాంజనేయులు, ఎం రామాంజనేయులు, రామారావు పాల్గొన్నారు.


అద్దంకి డిటికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు


రేపల్లెలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం కార్యకర్తలు



ముండ్లమూరులో సిపిఎం నాయకులు, కార్యకర్తల ధర్నా

నల్లరిబ్బన్లతో మున్సిపల్ కార్మికుల నిరసన



బాపట్లలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - బాపట్ల

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళనకు దిగిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులపై పోలీసులు లారీఛార్జి చేయడం హేయమైన చర్యని సిఐటియు పట్టణ నాయకులు కె శరత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని నెల్లూరు మున్సిపల్ కార్మికులు కోరారని అన్నారు. గతంలో 45 రోజులు నిరసన సందర్భంగా ఒప్పందాలపై స్పందన లేకపోవడంతో గత మూడు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మెకు దిగారని అన్నారు. బారా షాహిద్ దర్గా ప్రాంతం నుంచి మున్సిపల్ కార్మికులు ప్రదర్శనగా కార్పొరేషన్ కార్యాలయానికి వెళుతుండగా ఇన్చార్జి డిఎస్పీ, రూరల్ డిఎస్పీ, స్పెషల్ పోలీసు బలగాలు, రోప్ పార్టీ పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. ఈ నిర్బంధాన్ని అధిగమించి కార్పొరేషన్ కార్యాలయం వరకు చేరుకున్న కార్మికులను పోలీసులు అడ్డగించారని అన్నారు. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నందున లోపలికి వెళ్లేందుకు వీల్లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వివాదం చోసుకుందని అన్నారు. రెచ్చిపోయిన పోలీసులు లాఠీ ఛార్జి చేసి మహిళా కార్మికులను గాయపర్చడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో కన్వీనర్ ఓ లక్ష్మణరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, నాని, మురళి, అంకారావు, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, ప్రమీల, ఏసమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.

చీరాల : నెల్లూరులో మునిసిపల్ కార్మికులపై జరుగుతున్న దాడులు అరికట్టకపోగా కనీసం స్పందించక పోవటం అమానుషమని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ బాబురావు, ఎం వసంతరావు అన్నారు. మునిసిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చీరాల మునిసిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ గత సమ్మె కాలుపు ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ సమ్మె కాలంలో వేతనాలు ఇవ్వాలనే డిమాండ్ల కోసం న్యాయపరమైన సమస్యలపై కార్మికులు 42 రోజులుగా నిరవధిక ఆందోళన చేస్తున్నారని, పోలీసులు కార్మికులను నిర్బంధించి వారిపై లాఠీ చార్జి చేయటం దుర్మార్గమైన చర్యని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేపడుతున్నప్పటికీ సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించక పోవడమే కాకుండా కార్మికులపై దాడులకు ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. కార్మికులపై జరుగుతున్న దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ యూనియన్ జిల్లా నాయకులు గుంటగాని ఇమ్మానియెల్, వై సింగయ్య, గేరా క్రాంతి సాగర్, నాగరాజు, స్వరూప, భవాని పాల్గొన్నారు.


చీరాల మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

బాపట్ల కలెక్టర్‌కు అవార్డు

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి గరిష్ట విరాళాల సేకరణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి గరిష్ట విరాళాలు సేకరించినందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అవార్డును అందుకున్నారు. లోక్ భవన్ లోని దర్బార్ హాల్ లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న జరుపుకునే సాయుధ దళాల పతాక దినోత్సవం వారి శౌర్యం, విధి పట్ల అంకితభావం, అత్యున్నత స్థాయి నైపుణ్యానికి అభివందనం చేసే సందర్భంగా గరిష్ట విరాళాలు సేకరించినందుకు గానూ పలువురిని అభినందించారు. 2024 సంవత్సరంలో బాపట్ల జిల్లా నుంచి సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రూ.16.80 లక్షలు సేకరించి విరాళంగా అందజేశారు. ఈ సంవత్సరం గరిష్టంగా రూ.25 లక్షల రూపాయలు విరాళాల సేకరించి సహాయ నిధికి అందజేసి.. రాష్ట్ర గవర్నర్ నుంచి జిల్లా కలెక్టర్ అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

'బాపట్ల' పోలీసులకు ఎబిసిడి అవార్డు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పర్యాటక శాఖకు చెందిన వెబ్‌సైట్‌లను పోలిన నకిలీ వెబ్‌సైట్ లను రూపొందించి పర్యాటకులను మోసం చేస్తున్న కేసును సమర్థవంతంగా ఛేదించడం, తదనంతర దర్యాప్తును విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్‌కి, కేసును ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా పోలీస్ బృందానికి రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రతిష్టాత్మకమైన ఎబిసిడి (అవార్డు ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్) అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా జిల్లా ఎస్పీ, సంబంధిత పోలీస్ బృందం శుక్రవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీని, నకిలీ వెబ్ సైట్ లను రూపొందించే సైబర్ నేరగాళ్ళను చాకచక్యంగా అరెస్ట్ చేసిన జిల్లా పోలీస్ బందాన్ని డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. ఎబిసిడి అవార్డును డిజిపి చేతుల మీదుగా జిల్లా ఎస్పీతో పాటు బాపట్ల డిఎస్పీ జి. రామాంజనేయులు, బాపట్ల రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, సైబర్ సెల్ టి. శ్రీకాంత్, సిఐ షేక్ నాయబ్ రసూల్, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్స్ పి. సుబ్బరాజు, వి.రమేష్, కానిస్టేబుల్, ఐటీ కోర్ డి. సురేష్, కానిస్టేబుల్స్ కె. నాగరాజు,కె. బుజ్జి రాజు, ఐటీ కోర్ మహిళా కానిస్టేబుల్స్ డి. తబిత, ఐ.కీర్తి అందుకున్నారు.



ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌కు అవార్డు అందజేస్తున్న డిజిపి

ఇంటర్ సంస్కరణల అమలులో

నిర్లక్ష్యం తగదు..: ఆర్‌జెడి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఇంటర్మీడియట్ విద్యలో ఈ ఏడాది అమల్లోకి వచ్చిన సంస్కరణలను ఖచ్చితంగా అమలు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని ఇంటర్ విద్య ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్ (ఆర్‌జెడి) జె.పద్మ స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ విద్యామండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు ఎకెవికె జూనియర్ కళాశాలలో శుక్రవారం నాడు పరీక్షల నిర్వహణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ళ, అధ్యాపకులు, ముఖ్యంగా పబ్లిక్ పరీక్షల నిర్వహణాధికారులు పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పదో తరగతి వరకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్, ఆంగ్ల మాధ్యమం అమలైన నేపథ్యంలో జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ఇంటర్ విద్యలో కూడా సిలబస్, పరీక్షా విధానాల్లో మార్పులు తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్ బోర్డు ఓఎస్డీ (అకడమిక్) వి.వి. సుబ్బారావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్కరణల వివరాలు వెల్లడించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, ఆర్ఐఓ కె. ఆంజనేయులు మాట్లాడుతూ థియరీ పరీక్షల నిర్వహణకు అవసరమైన ట్రంక్ పెట్టెలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో చిన్నపాటి పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారితీయవచ్చని హెచ్చరిస్తూ, యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ళ ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.సదస్సులో ఎకెవికె జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ళ, పరీక్షల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జెడి పద్మ

మహిళా వ్యాపారులకు సహకారం అవసరం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలంటే ప్రభుత్వం, వ్యవస్థలు వారికి పూర్తి సహకారం అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. శుక్రవారం డిఆర్డిఏ ప్రకాశం ఆధ్వర్యంలో టీటీడీసీ ప్రాంగణంలో నిర్వహించిన ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ ముఖాముఖి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా వ్యాపారులతో ప్రత్యక్షంగా ముఖాముఖి నిర్వహించిన డాక్టర్ శైలజ, వారు చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెటింగ్ ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. మహిళా వ్యాపారిణులకు తాను ఎప్పుడూ తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. నారాయణ, డిపిఎంఐబి లక్ష్మీ రెడ్డి, డిపిఎం ఎల్‌హెచ్‌డీ దానం, డిపిఎం హెచ్‌డీ సుభాషిని, డిపిఎం కృష్ణకుమారి, డిపిఎం విజయమ్మ పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మంత్రి స్వామి

ప్రజాశక్తి-జరుగుమల్లి

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, అందులో భాగంగానే అంగన్‌వాడీలకు 5జీ స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం లోని మంత్రి క్యాంపు కార్యాలయం కొండపి నియోజక వర్గ పరిధిలోని అంగన్‌వాడీలకు 5జీ స్మార్ట్ ఫోన్లు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సేవల్లో వేగం, పారదర్శకతకు కూటమి ప్రభత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 58,204 అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.75 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ పీడీ సువర్ణ, టంగుటూరు సిడిపిఒ సిహెచ్.మల్లీశ్వరి, కొండపి సిడిపిఒ వి. సుశీల, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు 5జీ స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్న మంత్రి స్వామి

నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధికి కృషి: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో నిరుద్యోగ యువత నైపుణ్య అభివృద్ధి మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అందించడానికి కలెక్టర్ నేతత్వంలో ప్రఖ్యాతిగాంచిన సెంచురియన్ విశ్వవిద్యాలయం ప్రతినిధులతో ప్రకాశం భవనంలో సమావేశం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో సెంచురియన్ యూనివర్సిటీ ప్రతినిధి జె ఎన్ రావు, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు క్షమాగుణం

నేటి సమాజానికి మార్గదర్శకం

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రేమ మూర్తిగా భువిలోకి వచ్చిన ఏసుక్రీస్తు క్షమాగుణాలు, సూక్తులు నేటి సమాజానికి మార్గదర్శకం అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా శుక్రవారం స్థానిక పట్టణంలోని షాదీఖానా భవన్ లో సెమీ క్రిస్మస్ వేడుకలు, తేనీటి విందు కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ క్రిస్మస్ కేకును కోసి క్రైస్తవ పెద్దలు, పాస్టర్లకు పంచిపెట్టారు. అనంతరం కొవ్వొత్తులతో క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జగన్నాథం పార్థసారథి, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, డిఆర్‌డిఏ పీడీ లవన్న, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసిల్దార్ సలీమా, ఫాదర్ ఇన్నయ్య, రెవరెండ్ పి వరబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

జిల్లాకు రెండు భారీ పరిశ్రమలు

- **స్థాపించేందుకు ఒప్పందాలు..**
- **కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్**

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందాలతో బాపట్ల జిల్లాలో రెండు భారీ పరిశ్రమలు స్థాపించడానికి ఒప్పందాలు కుదిరాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ చెప్పారు.జిల్లాస్థాయి పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది.భారీ పరిశ్రమల రాకతో బాపట్ల జిల్లా రూపు రేఖలు మారనున్నాయని కలెక్టర్ చెప్పారు. గాజు ఉత్పత్తి పరిశ్రమ, సౌర విద్యుత్ పలకల ఉత్పత్తి పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు జరిగాయన్నారు. ఆ పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలుగా అనుమతుల మంజూరుకు, సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సూచించారు. బాపట్ల జిల్లా పర్యాటక పరంగా అభివద్ధి చెందేందు కోసం ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలోని 84 కిలోమీటర్ల తీరం అభివద్ధిపై మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, రూపొందించిన ప్రణాళికను రాష్ట్ర ముఖ్యమంత్రికి మంగళవారం నివేదించనున్నట్లు తెలిపారు.

ఒక కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త

ఒక కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీసుకురావడమే లక్ష్యంతో పరిశ్రమల అభివద్ధి విధానాన్ని ప్రభుత్వం చేపట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఓత్సాహికులకు వేగంగా అనుమతులు ఇచ్చేలా సింగిల్ డెస్క్ పోర్టల్ ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ చెప్పారు. పరిశ్రమల అభివృద్ధి విధానంలో వివిధ పరిశ్రమలు స్థాపించిన వారు రాయితీలు పొందడానికి 238 దరఖాస్తులు వచ్చాయన్నారు. పెట్టుబడి రాయితీ, వాణిజ్య పన్నుల రాయితీ, విద్యుత్ రాయితీ, వడ్డీ తిరిగి చెల్లింపుల రాయితీ విధానంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన జిల్లా కమిటీ 235 యూనిట్లకు రూ.9.34 కోట్లను రాయితీగా ఇవ్వాలని తీర్మానించి, ఆమోదించింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం వై రామకృష్ణ, ఎల్ డి ఎం శివకృష్ణ, జిల్లాస్థాయి కమిటీలోని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థులతో టాపీ పని

ప్రజాశక్తి-కొండపి

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులతో టాపీ పనులు చేయిస్తున్న ఘటన కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెలుగుచూసింది. పాఠశాల అబివృద్ధికి కేటాయించిన నిదులతో పాఠశాలలో అవసరమైన పనులు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఆద్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు చేయించాల్సి ఉంది. శుక్రవారం పాఠశాల ప్రధాన గేటు వద్ద సిమెంట్‌తో కట్ట వేయించాల్సి ఉంది. ఆయా పనిని విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు చేయించారు. విద్యార్థులతో ఇలాంటి పనులు చేయించడం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించి.. హెచ్‌ఎం తీరును తప్పుపట్టారు.



టాపీ పని చేస్తున్న విద్యార్థి

రోడ్డు అభివృద్ధి ఎప్పుడో.?

ప్రజాశక్తి - భట్టిపోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలు ప్రధాన రహదారి సింగల్ మార్గంగా ఉండటంతో నిరంతరం ట్రాఫిక్ సమస్య ఎదురవుతుంది. స్థానిక పిహెచ్‌సి నుండి తెనాలి రోడ్డులోని జగనన్న కాలనీ వరకు రోడ్డు సింగల్ మార్గంగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ రెండు ప్రాంతాల మధ్య గ్రామంలోని రహదారిలో ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పర్చాలని ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. కానీ పాలకులు మారుతున్నప్పటికీ రోడ్డు రూపు రేకలు మాత్రం మారటం లేదు. ఇప్పటికే అనేకసార్లు ఆక్రమణలు తొలగించి రోడ్డు అభివృద్ధి చేయాలనే దృక్పథంతో సర్వే చేసి రోడ్డు స్థలం ఎక్కడ వరకు ఉంది, ఎంతవరకు ఆక్రమణ జరిగాయో మార్కింగ్ చేసిన సంఘటనలు ఉన్నాయి. కానీ ఆక్రమణలు తొలగించేందుకు ఎన్నికల ముందు ఓట్ల కోసం ప్రగల్బాలు పలికే నాయకులు గెలుపొందాక అభివృద్ధి పర్చటానికి సాహసం చేయలేకపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత టిడిపి ప్రభుత్వంలో నేటి శాసన సభ్యులు ఆనందబాబు ఈ రోడ్డు అభివృద్ధి చేయాలని యోచించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. తదనంతరం వైసిపి ప్రభుత్వంలో మాజీ మంత్రి మెరుగు నాగార్జున కూడా రోడ్డును అభివృద్ధి చేసి భట్టిప్రోలు రూపురేఖలు మార్చాలని సర్వేలు నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు. కానీ స్థానిక నాయకులు, ప్రధాని రహదారి వెంట ఉన్న వ్యాపారస్తుల దెబ్బకు ఆయన కూడా ఈ అంశాన్ని మరుగున పెట్టారు. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి చేయాలిఎటు చూసినా చిన్న చిన్న మండల కేంద్రాల సైతం అభివృద్ధి చెందుతుంటే భట్టిప్రోలు మాత్రం ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. రోడ్డు విస్తరణ లేకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందనేది గ్రామస్తుల వ్యాఖ్యానాలు. ఆక్రమణలు తొలగించి రోడ్లను అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ సమస్య తీరటమే కాక వ్యాపార దుకాణాలు విస్తరించి అభివృద్ధి చెందేందుకు దోహద పడుతుందని అభిప్రాయం. గతంలో ఈ రోడ్డు విస్తరణకు గ్రామస్తులు కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అన్ని విధాల ఆక్రమణ తొలగింపుకు ప్రయత్నాలు చేసింది. కొందరు స్వార్థ పూరిత రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం ఆ పనులు జరగలేదు. ఇప్పటికైనా పెరుగుతున్న ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



భట్టిప్రోలులోని ప్రధాన రహదారి

'అడ్డగడ' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పర్చూరు

దాతల సహకారం సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మాజీ ఎంపీటీసీ, అడుసుమల్లి ఉపసర్పంచి అడ్డగడ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అడుసుమల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలకు ఆయన ఉచితంగా మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అందుకు అయ్యే ఖర్చు తానే ఇస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు నిర్మల కుమారి తెలిపారు. పాఠశాల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రహరీ గోడ నిర్మాణానికి జెడ్పి నిధులతోపాటు ఎస్‌ఎస్‌ఎ నిధులు మంజూరు చేయించి నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. ఆయనను ఘనంగా దుశ్శాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులు రావటంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేశారని తెలిపారు. ఎంఎల్‌ఎ ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం నిర్మలా కుమారి, ఎపి రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపసర్పంచి అడ్డగడ వెంకటేశ్వర్లు

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - యద్దనపూడి

యద్దనపూడి సచివాలయం నందు పారిశుద్ధ కార్మికులకు నిత్యవసర సరుకులు, బట్టలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ రేణుక బాలకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎండిఓ అఖిల్ జావేద్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఎంత చేసిన తక్కువేనని అన్నారు. తమ ప్రాణాలు, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వీధులు శుభ్రం చేస్తున్నారని అన్నారు. సైడ్ కాల్వలు శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతురని అన్నారు. ప్రజలు ఇంటి పన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇంటి, నీళ్ల పన్ను బకాయలు ఉన్నట్లయితే ఇతర ప్రభుత్వ పథకాలు అందుకోడంలో ఇబ్బంది ఉంతుందని అన్నారు. ప్రజలు అర్థం చేసుకొని గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, నాయకులు కనపర్తి నాగేశ్వరరావు, ఓలేరు బాలకోటేశ్వరావు పాల్గొన్నారు.


బట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం


విద్యార్థికి అవసరతలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భట్టిపోలు

మండల కేంద్రం భట్టిపోలులోని అద్దేపల్లిలో నివసిస్తున్న దివి హరిత అనే పేద విద్యార్థిని స్థానిక కెఎస్‌కె కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ పేదరికం కారణంగా ఫీజులు కట్టలేక విద్యకు దూరమైంది. 1976-77 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు చిన్ననాటి మిత్రుల గ్రూపు తరపున పసుపులేటి శివరామ ప్రసాద్ అభ్యర్ధన మేరకు హైదరాబాద్‌లో నివసిస్తున్న తమ గ్రామ వాసి బట్టు నాంచారయ్య ఆ విద్యార్థినికి ఫీజు చెల్లించి చదువుకు తొడ్పాటు ఇచ్చారు. దీనిలో భాగంగా ఆ బ్యాచ్ విద్యార్థులు హరితకు బుక్స్, దుస్తులు, స్కూల్ యూనిఫాం, పౌష్టిక ఆహారం, నిత్యావసర సరుకులు అందించినట్లు శివరాం ప్రసాద్ తెలిపారు. పూర్వ విద్యార్థి బోలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1976-77 విద్యార్థుల సేవలు, దాత బట్టు నాంచారయ్య ధాత్రుత్వాన్ని ప్రశంశించారు. కార్యక్రమంలో మద్దుల వెంకటరత్నం, బోలిశెట్టి శ్రీనివాస్, సయ్యద్ యూసఫ్, పి రమేష్, పసుపులేటి శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.


పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు జయచంద్ర

పాడి రైతుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - అద్దంకి

పశు గణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పాడి రైతులకు పశువుల ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పనిచేస్తుందని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఎస్ జయచంద్ర పేర్కొన్నారు. మండలంలోని మణికేశ్వరంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. కృత్రిమ గర్భధారణ విస్తరణ, లింగ నిర్ధారిత వీర్యం సరఫరా వంటి కార్యక్రమాలు సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల మేలు జాతి దూడలు లభించడమే కాకుండా పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. గర్భకోశ వ్యాధుల చికిత్స, నట్టల నివారణ, గాలికుంటు, గొంతువాపు వంటి ప్రాణాంతక వ్యాధులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎడి బ్రహ్మయ్య, టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, డాక్టర్ సైదయ్య, రాంబాబు, శ్వేత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శివకుమారి

ప్రకృతి వ్యవసాయం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

ప్రకృతి వ్యవసాయం, టిఎం మోడల్ పద్ధతుల్లో కూరగాయలు, పంటలు సాగు చేయడం ద్వారా నిత్యం ఆదాయం, ఆరోగ్యం కలుగుతుందని మండల కో ఆర్డినేటర్ యేమినేడి శివ కుమారి వివరించారు. ప్రకృతి సేద్యం సాగులో అపోహలు వద్దని చెప్పారు. ఎఒ చుక్క విజయ రాజు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులు గమనించాలని అన్నారు. సమావేశానికి సిసి శేషగిరారవు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ కరిముల్లా, ఎపిఎం మస్తానరావు, ఎన్‌ఎఫ్‌ఎ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ-పాస్ మిషన్ నమోదు చేయాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఎరువుల విక్రయాలను ఈపాస్ నమోదు చేయాలని బాపట్ల ఎడిఎ కె ధనరాజు పేర్కొన్నారు. ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల్లో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. రైతులకు అమ్మిన ప్రతి ఎరువు బస్తా ఈపాస్ మిషన్‌లో నమోదు చేయాలని అన్నారు. లేకపోతే కేంద్రం నుండి ఎరువుల సరఫరా నిలిపివేస్తారని తెలిపారు. దుకాణాల్లో, ఎరువులు విక్రయించే సహకార సంఘాల్లో వాస్తవ నిల్వలకు ఈపాస్ మిషన్ల నిల్వలకు సరిపడా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. నిల్వల తేడా లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎఒ ఎండి ఫారూఖ్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని ఎరువుల దుకాణాల్లో ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీ చేశారు. బాపట్ల ఎడిఎ కె ధనరాజ్ ఎరువుల దుకాణాల్లోని నిల్వలు, ఈపాస్‌లో నమోదైన వివరాలు పోల్చి చూశారు. ఎరువులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకి అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఒ బి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.


శానిటరీ నాప్‌కిన్స్ అందజేస్తున్న దృశ్యం

శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక చైతన్య మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బదిరుల ఆశ్రమ పాఠశాల్లో ఎంఇఒ కెవి శ్రీనివాసరావు చే సానిటరీ నాప్కిన్ ఇన్సినేరేటర్‌ను బ్యాంకు విశ్రాంత ఉద్యోగి బాబురావు వితరణగా పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని అన్నారు. అప్పుడే విజయానికి చేరువతారని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ప్రభుత్వం కల్పించిన అవకాశాలు వినియోగించుకొని ఉన్నత స్థితిలో ఉండాలని కోరారు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగి బాబురావు మాట్లాడుతూ ఈ పాఠశాల్లోని విద్యార్థినులకు అవసరమైన శానిటరీ నాప్కిన్ ఇన్సినేరేటర్‌ను అందించటం తనకు సంతోషకరంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎల్లవేళలా తమ కుటుంబ సహకారం ఈ పాఠశాలకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిర్వహకురాలు పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపల్ సురేంద్రబాబు, రమేష్, నవీన్, ధైర్యం శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వృద్ధులకు అన్నదానం చేస్తున్న రాంబాబు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - చీరాల

మాజీ ఎంఎల్‌ఎ కరణం బలరామ కృష్ణ మూర్తి, వైసిపి ఇంచార్జీ కరణం వెంకటేష్ బాబు సహకారంతో వైసిపి మేధావుల విభాగం అధ్యక్షుడు తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో దండుబాట రోడ్డులోని కోటయ్య వృద్ధాశ్రమంలోని వృద్ధులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. వృద్ధాశ్రమంలో కేకు కట్ చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు.


షాపుల నిర్వహణకు భూమి చదును చేస్తున్న దృశ్యం

మాంసాహార దుకాణాలకు స్థలం కేటాయింపు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని ముప్పవరంలో రోడ్డు ప్రక్కన చికెన్, మటన్, ఫిష్ అమ్ముకోవటం వలన వ్యర్థ పదార్థాల నుండి దుర్వాసనతో నిలువ లేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జాగర్లమూడి వారిపాలెం సొసైటీ అధ్యక్షులు అల్లమనేని బ్రహ్మానందస్వామి, సర్పంచ్ సాంబయ్య గ్రామంలోని నాయకుల సలహాతో వారికి స్థలం కేటాయించాలని నిర్ణయించారు. జెసిబి ఉపయోగించి శుక్రవారం స్థలం చదును చేశారు. హైవే పక్కనున్న 20 సెంట్లు స్థలంలో వారే షాపులు నిర్మించుకొని అమ్ముకోవచ్చని అన్నారు. కుక్కపల్లి ఏడుకొండలు, డి భవన్నారాయణ, గరిమిడి జగన్మోహన్ రావు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి - బాపట్ల

విద్యుత్ మీటర్లకు ప్రజలు తమ ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని విద్యుత్ ఎఈ సాయి శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ లైన్ మెన్, విద్యుత్ సిబ్బంది శుక్రవారం నుండి ప్రతి ఇంటికి వచ్చి మీటర్ నెంబర్‌కు ఆధార్ నెంబర్ అనుసంధానం చేస్తారని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డిజిటల్ సేవలతో 'అంగన్‌వాడీ' బలోపేతం



ఫోన్లు అందజేస్తున్న ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు

అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జి స్మార్ట్ ఫోన్లు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఆయన స్వయంగా అంగన్‌వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, ప్రాజెక్టు ఆఫీసర్లకు 5జి మొబైల్స్ అందజేశారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార వివరాలు, హాజరు న మోదు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలు యాప్‌ల ద్వారా సమర్ధవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.

వేమూరు : మండలంలో నిర్వహించిన 'మీకోసం పిజిఆర్ ఎస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కారం'లో శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలు స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జొన్నలగడ్డ విజయబాబు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని లక్ష్మీదేవి, ఎంపిడిఒ రవిబాబు, తహశీల్దార్ బి సుశీల ఉన్నారు.



సెల్ ఫోన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

ఐక్య క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో పాస్టర్స్ అసోసియేషన్, ఇవాంజలిస్టుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గత 25ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఆటోనగర్ ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చేనేత టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే కొండయ్యను పాస్టర్లు సన్మానించారు. రాజా సిల్వన్, పి ఎలీషారెడ్డి, రత్నరాజు, గొరపాటి పుష్పరాజ్, దేవరపల్లి రంగారావు, టీడీపీ అధ్యక్షులు దోగుపర్తి వెంకట సురేష్, కౌన్సిలర్ సలూరి సత్యానందం, డేటా నాగేశ్వరావు, దానియేలు ప్రసాద్ పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక వెలుగు కార్యాలయంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఎపి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షంషుద్దీన్ మాట్లాడారు. లోక రక్షకుడు ఏసుక్రీస్తు ప్రభువు సూచించిన మార్గంలో నడుచుకోవాలని చెప్పారు. ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ క్రిస్టమస్ కేక్ కట్ చేసి పంపించి పెట్టారు. ఎపిఎం కె రామకృష్ణ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని అనంతవరం సచివాలయం నందు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎంపిడిఒ జావెద్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దొప్పలపూడి మోహన్ బాబు, తేజ శివ ప్రసాద్, ప్రేమానందం, రత్నకిషోర్, భారతి, యశ్వంత్, స్వాతి, షకీలా బాను, ఏయేసు, మరియమ్మ, సుబ్బారావు, వాసు, వెంకటేశ్వర్లు, తారక, శ్రీను, లక్ష్మి, వంశీ, సబీనా పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య

బాపట్ల : ప్రేమ, కరుణ, శాంతి, ఐక్యతకు క్రిస్మస్ పండుగ ప్రతీకని కమిషనర్ రఘునాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్లో పురపాలక సంఘ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. పాస్టర్ సిహెచ్ యేసు రత్నం, మున్సిపల్ డిఈ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, డిపిఒ ఎస్ మల్లిఖార్జునరావు, ఆర్ఓ ఇన్‌చార్జ్ మేనేజర్ అబ్దుల్ జబ్బార్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : స్థానిక ఎస్సీ కాలనీలోని ఏసు మందిరంలో శుక్రవారం జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్ క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్లకు దుస్తులు, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ కంభంపాటి సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ గర్నెపూడి యోహోను, ట్రెజరర్ కె షాలేము, సభ్యులు ఎం యెహోషా, పి చిన్న అబ్రహం పాల్గొన్నారు.

పోరాట యోధులను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - మార్టూరు

భారత స్వాతంత్ర్య చరిత్రలో అగ్నియుగం నాటి విప్లవ పోరాట యోధులు అష్ఫాకుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ త్యాగ స్ఫూర్తి నేటి యువతకు ఎంతో ఆదర్శనీయమని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా కేంద్ర కమిటీ సభ్యులు మహ్మద్ భాషా తెలిపారు. అష్ఫాక్, రాంప్రసాద్ ఆంగ్లేయులచే 1927 డిసెంబర్ 19న ఉరితీయబడిన రోజు సందర్భంగా ముస్లిం చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక గన్నవరం రోడ్డులో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దేవరపల్లి రాము, మైలా నాగేశ్వరావు, పఠాన్ వలి, పఠాన్ బాబు, షేక్ ఆదంబీ, నాగేంద్ర, కరిముల్లా, దాసు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

తెగిపడ్డ విద్యుత్తు తీగలు - త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - చీరాల

ఈపూరుపాలెం ప్రధాన రహదారి వెంబడి నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చేపట్టిన పనుల్లో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. పాఠశాల సమీపంలో చెట్టు కొమ్మలు తొలగిస్తున్న సమయంలో విరిగిన కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో 4తీగలు తెగి ఆగి ఉన్న పాఠశాల బస్సుపై పడి షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు కాలిపోవడం, ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై రూరల్ ఏఈ బ్రహ్మాంను 'ప్రజాశక్తి' వివరణ కోరగా నూతన విద్యుత్ స్తంభాల పనుల్లో భాగంగా ఎల్‌టీ లైన్లను నిలిపివేసి సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. అయితే 11 కెవి లైన్‌కు విద్యుత్ సరఫరా ఉండటంతో చెట్టు కొమ్మలు తీగలను తాకి స్వల్పంగా నిప్పు రవ్వలు వచ్చాయని, ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.



అర్జీ పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ నరేంద్ర వర్మ

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజా సమస్యల ఫిర్యాదు వేదికలో ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్, పిపిపి (పి4) కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి అధికారులను సమన్వయం చేసుకుని సత్వరం పరిష్కారించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని అన్నారు.



జవాను విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఐలవరంలో జవాన్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరంలో అమర జవాన్ గాలి శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జవాన్ త్యాగాన్ని స్మరించుకున్నారు. దేశ రక్షణకు ప్రాణాలర్పించిన సైనికులు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. వారి త్యాగ స్ఫూర్తి భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు దీపాల ప్రసాద్, మాచర్ల నాగరాజు, అనగాని ఏడుకొండలు, బండికోళ్ల నందయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైసిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని చావలి గ్రామం కొత్తపాలెంలో గాజుల సుబ్బారావు సతీమణి స్వరాజ్యం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ఆమె నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ చైర్మన్ గాజుల మోహన్, వైసిపి మండల కన్వీనర్ దాది సుబ్బారావు, గాజుల వెంకట కృష్ణారావు, వేమూరు సొసైటీ మాజీ అధ్యక్షులు గాజుల భాను ప్రకాష్, సోమరౌతు పాండురంగరావు, సుగ్గన మల్లేశ్వరావు ఉన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - ముండ్లమూరు

జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థమైన, సత్వర న్యాయం అంశంపై తెలుగు, ఇంగ్లీషు భాషల్లో వక్తృత్వం, వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. వ్యాసరచన తెలుగు మీడియంలో ముండ్లమూరు కెజిబివి విద్యార్థిని జి కృష్ణ లావణ్య ప్రథమ స్థానం సాధించగా ఇంగ్లీష్ మీడియంలో ముండ్లమూరు జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థి పి నాగ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రథమ స్థానం పొందారు. వక్తృత్వం తెలుగు మీడియంలో ముండ్లమూరు కెజిబివి విద్యార్థిని ఎం అనుప్రియ, ఇంగ్లీష్ మీడియంలో ఉమామహేశ్వరపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని డి ప్రశాంతి ప్రథమ స్థానం సాధించారు. విజేతలు ఎంఈఓ షేక్ కాలేషావలి అభినందించారు.

బల్లికురవ : 'డిజిటల్ న్యాయవ్యవస్థ ద్వారా సమర్ధవంతమైన, వేగవంతమైన పరిష్కారం' అనే అంశంపై బాపట్లలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి 'డిబేట్' పోటీలో తెలుగు మీడియం విభాగంలో కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి లక్ష్మీ అమూల్య ప్రథమస్థానంలో నిలిచి రూ.5వేల నగదు బహుమతి పొందారు. ఈ నెల 23న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా తరపున ఆమె పాల్గొంటుందని హెచ్ఎం పురంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

రైతులకు విజ్ఞాన యాత్ర

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రైతులు పంటలు పండించిన తరువాత ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేయడం ద్వారా జీవనోపాధి పొందడం వంటి విషయాలపై విజ్ఞాన యాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు ఎఒ ఎండి ఫారుక్ హుస్సేన్ తెలిపారు. బాపట్ల పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త ఎల్ ఏడుకొండలు వివిధ పంటల్లో గ్రేడింగ్ విధానం, డిమాండ్ ఉన్న పంటలు పండించడం, పంటలకు విలువ జోడించి మార్కెటింగ్ చేయడం, రైతులు సంఘాలు ఏర్పడి పంట ప్రాసెసింగ్ చేయడం, ప్రాసెసింగ్ చేసిన పంటలకు మార్కెటింగ్, బ్రాండింగ్ వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ వాసుదేవరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పంగులూరు

మోటార్ సైకిల్‌పై వేగంగా వస్తూ ట్రాక్టర్ ట్రక్కు వెనక భాగాన్ని ఢీకొన్న ప్రమాదంలో చందలూరు గ్రామానికి చెందిన పెండ్యాల సుధాకర్ (55) అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం అద్దంకి నుండి స్వగ్రామమైన చందలూరుకు మోటార్ సైకిల్‌పై వస్తు చందలూరు సమీపంలో మలుపు తిరిగే దగ్గర ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ట్రక్కును గమనించక ఢీకొట్టాడు. ప్రమాదంలో సుధాకర్ తలకు బలమైన గాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందాడని రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు చెప్పారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య అనంతలక్ష్మి, కుమారులు విష్ణు, చరణ్ ఉన్నారు.

మినీ వ్యాన్‌ను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - మార్టూరు

మినీ వ్యాన్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన మార్టూరు సమీపంలోని ఇసుక దర్శి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. హైవే పెట్రోలింగ్ పోలీసుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా మద్దిపూడికి చెందిన గండి రత్తయ్య తన రేషన్ బియ్యం సరఫరా చేసే వ్యానులో మార్టూరులో కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి తన స్వగ్రామం వెళుతుండగా ఇసుక దర్శి వద్ద ఎదురుగా అతి వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మినీ లారీ బోల్తా పడింది. అందులోని డ్రైవర్ రత్తయ్య తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మినీ వ్యాన్‌ను ఢీకొట్టి పారిపోయిన లారీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కారు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని రామిరెడ్డిపాలెం వద్ద అద్దంకి, నార్కెట్‌పల్లి రహదారిపై శుక్రవారం గ్రామానికి చెందిన సోము సోమిరెడ్డి (63) ఉదయాన్నే రహదారి వెంట నడుచుకొని వెలుతుండగా హైదరాబాదు నుండి ఒంగోలు వైపు వెలుతున్న కారు ఢీకొంది. దీంతో సోమిరెడ్డికి తీవ్ర గాయాలై రోడ్డుపై పడిపోయాడు. వెంటనే ఏల్చూరు టోల్ ప్లాజా అంబులెన్స్‌లో నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమిరెడ్డికి భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ పట్టాభిరామయ్య పరిశీలించారు.

శనగలో వేరుకుళ్లు, ఎండు తెగుళ్లు

ప్రజాశక్తి - పంగులూరు

రబీ సీజన్లో సాగు చేసిన శనగ పంటకు అక్కడక్కడ వేరు కుళ్లు, ఎండు తెగులు కనిపిస్తున్నట్లు ఎఒ డి సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని చందలూరులో శనగ పంట పరిశీలించారు. జొన్న, మొక్కజొన్న పంటతో పంట మార్పిడి చేయడం ద్వారా తెగుళ్ల నివారించవచ్చని తెలిపారు.

కమిటీల ఎంపికలో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైసిపి సంస్థాగత కమిటీల నియామకంలో వేమూరు నియోజకవర్గం రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచిందని వైసిపి రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తీరును ఆయన అభినందించారు.



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

గ్రామీణ పేదల

'ఉపాధి' హక్కులు హరించే యత్నం

22న కలెక్టరేట్ వద్ద నిరసనకు వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని వామపక్ష నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాన్ని ఏకపక్షంగా స్కీమ్‌గా మార్చడం ద్వారా గ్రామీణ పేదల ఉపాధి హక్కులను హరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో శుక్రవారం వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్. నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె మాబు, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఎంఎస్ సాయి మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం పేరును మార్చుతూ ప్రతిపక్షాల వాదనలు వినకుండా పార్లమెంటులో బిల్లును ఆమోదింపజేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 22వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు పలు ప్రయత్నాలు సాగుతున్నాయని విమర్శించారు. స్వాతంత్ర ఉద్యమంతో సంబంధం లేని బీజేపీ-ఆర్ఎస్ఎస్ చరిత్రను మార్చే ప్రయత్నం చేస్తోందని, అందులో భాగంగానే ఉపాధి హామీ చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించారని ఆరోపించారు. దేవుళ్ల పేర్లతో పథకాలు అమలు చేస్తే విమర్శలు ఉండవన్న రాజకీయ ఉద్దేశంతో రాముడి పేరును చేర్చారని పేర్కొన్నారు.

ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురాం, సీపీఐ సంతనూతలపాడు నియోజకవర్గ కార్యదర్శి నల్లూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

మనుగడలో లేని ఖాతాల నుంచి

నగదును తిరిగి తీసుకోవచ్చు..: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మనుగడలో లేని బ్యాంక్ ఖాతాల నుంచి నగదును తిరిగి తీసుకోవడానికి ఆర్.బి.ఐ అనుమతులు ఇచ్చిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. మీ డబ్బు-మీ హక్కు పేరుతో యూనియన్ బ్యాంక్ రూపొందించిన గోడ పత్రాలను శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. బ్యాంకు ఖాతాలను పదేళ్లుగా వినియోగించకుండా నిలిపివేస్తే ఆ ఖాతాలలోని నగదు ఆర్.బి.ఐ ఖాతాలోకి వెళ్ళిపోతుందని కలెక్టర్ చెప్పారు. అలాంటి ఖాతాలలో నిల్వ ఉన్న నగదు బాపట్ల జిల్లాలో వ్యక్తిగత ఖాతాలకు చెందిన సొమ్ము రూ.29.87 కోట్లు కాగా, వివిధ సంస్థలకు చెందినవి రూ.2.50 కోట్లు ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన నగదు రూ.1.60 కోట్లు ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకులలో ఈ నగదు రూ.33 కోట్లకు చేరిందన్నారు. కార్యక్రమంలో ఎల్ డి ఎం శివకృష్ణ, పరిశ్రమల శాఖ మేనేజర్ రామకృష్ణ, డిఎల్‌డివో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రభుత్వం భరోసా

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

లైంగిక వేధింపులను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటు న్నాయని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ గుర్తు చేశారు. మహిళల రక్షణకు ప్రభుత్వం ఉందనే భరోసాను ప్రతి ఒక్కరిలో కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం ఒంగోలులో ఆమె సుడిగాలి పర్యటన గావించారు. రిమ్స్ ఆసుపత్రిలోని నర్సింగ్ హాస్టల్, సఖి వన్ స్టాప్ సెంటర్, రామ్‌నగర్ లోని గృహహింస నిరోధక చట్టం కేంద్రం, బాలసదనం కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికలకు ఆశ్రయం, రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం సఖి వన్ స్టాప్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని నర్సింగ్ హాస్టల్‌లో సుమారు 500 మంది విద్యార్థులు ఉండటం అసౌకర్యంగా ఉందని విద్యార్థులు చైర్పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆమె ప్రత్యేక భవనంలోకి హాస్టల్‌ను మార్చే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. సఖి వన్ స్టాప్ సెంటర్‌లో అమలవుతున్న కార్యక్రమాలపై వివరాలు అధికారులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం గృహహింస నిరోధక చట్టం కేంద్రాన్ని, బాలసదనం కేంద్రాన్ని పరిశీలించిన ఆమె అక్కడి పిల్లలతో ముచ్చటించారు. బాలసదనం కేంద్రంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఎస్ సువర్ణ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ సుమిత్రాదేవి, దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణమూర్తి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయపాటి శైలజ

డిజిటల్ ఏవీసీ తప్పనిసరి

డిటిఒ జగన్నాథరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లాలో పింఛనుదారులందరూ 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఏన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ (ఎవిసి)లను తప్పని సరిగా సమర్పించాలని ప్రకాశం జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారి ఎ.జగన్నాథరావు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ 2026 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఖజానా కార్యాలయాలతో పాటు పోస్టాఫీసులు, మీ-సేవా కేంద్రాలు, నెట్ సెంటర్ల ద్వారా ఏవీసీలను స్వీకరించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, పొదిలి, దర్శి, కనిగిరి, కంభం, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం తదితర ఉప ఖజానాల పరిధిలో సర్వీస్ పింఛన్ పొందుతున్న వారు లైఫ్ సర్టిఫికెట్, నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్‌లను సమర్పించాల్సి ఉంటుందన్నారు. నిర్ణీత గడువులో పత్రాలు సమర్పించి తమ పింఛన్ చెల్లింపులను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ పింఛనుదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డిజిటల్ ఎవిసి విధానాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈ విధానంపై పింఛనుదారుల సంఘాల నాయకులు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అలాగే ఉపఖజానా కార్యాలయాలకు వచ్చే పింఛనుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

'ప్రకాశం' పోలీసు శాఖకు

ఏబీసీడీ అవార్డు

- వీరయ్య చౌదరి హత్య కేసులో సమగ్ర దర్యాప్తుకు ఫలితం..
- డీజీపీ ద్వారా అందుకున్న పోలీసులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్:

రాష్ట్రంలో సంచలనం సష్టించిన ప్రకాశం జిల్లా, ఎన్.జి.పాడు మండలం, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసును పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి లోతుగా దర్యాప్తు చేసి, ముద్దాయిల అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించిన విషయం తెలిసిందే.. ఈ కేసులో అత్యుత్తమంగా విధులు నిర్వహించిన పోలీసు అధికారుల నేతత్వంలో చేపట్టిన సమగ్ర దర్యాప్తు ఫలితంగా ప్రకాశం జిల్లా పోలీసు శాఖకు ఎబిసిడి (అవార్డు ఫర్ బెస్ట్ క్రైం డిటెక్షన్) అవార్డు లభించింది. మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ద్వారా గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి సమక్షంలో ఏబిసిడి అవార్డు ప్రదానం చేయటం జరిగింది.

ఈ సందర్భంగా ప్రకాశం ఎస్పీ వి.హర్ష వర్ధన్‌రాజు, ప్రస్తుత విజయనగరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యు.సుధాకర్, ప్రస్తుత ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ యస్.జగదీష్, డీటీసీ ఇన్స్పెక్టర్ వై.పాండురంగారావు, గతంలో చీమకుర్తి ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన యం.సుబ్బారావు, సోషల్ మీడియా సెల్ ఇన్స్పెక్టర్ వి.సూర్యనారాయణ, సంతనూతలపాడు ఎస్సై వి.అజయ్ బాబు ఈ అవార్డును అందుకున్నారు.

ఇలాంటి కేసులను సమర్థవంతంగా పరిష్కరించినప్పుడే ప్రజల్లో పోలీసు శాఖపై గౌరవం మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ అన్నారు. ఈ అవార్డును స్ఫూర్తిగా తీసుకొని, జిల్లా పోలీసులు భవిష్యత్తులో కూడా మరిన్ని కేసులను సమిష్టిగా, సమర్థవంతంగా ఛేదించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు శాఖ సాధించిన ఈ ఘనత మరింత బాధ్యతతో ప్రజల భద్రత కోసం పనిచేయడానికి ప్రేరణగా నిలవాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జి దుర్మార్గం..

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల తో శాంతియుతంగా ఉద్యమిస్తున్న మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జి చేయడం తీవ్ర అక్షేపణీయమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఒంగోలు నగర కమిటీ పేర్కొంది. గురువారం నాడు నెల్లూరు మున్సిపల్ కార్మికులపై పోలీసుల దాడులను నిరసిస్తూ మున్సిపల్ యూనియన్ ధర్నా చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 25 రోజులుగా నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు శాంతియుతంగా నిరసనలు చేపడుతున్నారని తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న కార్మికులపై మున్సిపల్ శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలోనే పోలీసులు లాఠీఛార్జి చేసి మహిళా కార్మికులపై దుర్భాషలాడటం, చెప్పకూడని చోట బూట్లతో తన్ని గాయపరచడం అత్యంత అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకుల పట్ల అనుచితంగా ప్రవర్తించి, 60 మందిపై అక్రమంగా కేసులు బనాయించడం ప్రజాస్వామ్య హక్కులపై దాడేనని విమర్శించారు. నెల్లూరులో జరిగిన లాఠీఛార్జిని ప్రకాశం జిల్లా మున్సిపల్ యూనియన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరోసారి సమ్మె పోరాటానికి కార్మికులు సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహం, టి.విజయమ్మ, సంతోషమ్మ, నాయకులు కె.మోహన్‌రావు, యు.రత్నకుమారి, నిర్మల, కత్తి మరియమ్మ, కె.కపాకర్‌రావు, జానపాటిపిల్లి గిరిజ, కోటయ్య, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, మున్సిపల్ కార్మికులు

సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలో ఒంగోలు నగరపాలక సంస్థలోని సమతా నగర్, విరాట్ నగర్, పేర్నమిట్టలలో 5 డివిజన్లలో రూ.5 కోట్లా 60 లక్షల వ్యయం కాగల సిసి రోడ్లు, సైడ్ కాలువలకు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్‌కుమార్, ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు కమి షనర్ కోడూరి వెంకటేశ్వరరావు శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అభివద్ధి, సంక్షేమం ముందంజలో ఉందని పేర్కొన్నారు. వాడవాడలా సిమెంట్ రోడ్లు, సైడ్ కాల్వలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సంతనూతలపాడు నియోజకవర్గాన్ని జిల్లాలో అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తమ దష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తామని చెప్పారు. 39వ డివిజన్ సమతానగర్ నాలుగో లైన్‌లో రూ.2 కోట్లు, 38వ డివిజన్ సమతానగర్‌లో రూ.కోటి, 40వ డివిజన్ ద్వారకా నగర్ రెండవ లైన్‌లో కోటి రూపాయలు, పేర్నమిట్ట 41 డివిజన్ పోలేరమ్మ గుడి సమీపాన కోటి మూడు లక్షల పదహారు వేల రూపాయలతో, 43వ డివిజన్ విరాట్ నగర్ నందు రూ.56 లక్షలా 64 వేల రూపాయలతో సిసి రోడ్లు, సైడ్ కాలవలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మలగా రమేష్, కండె స్వాతి రమణ యాదవ్, తేళ్ళ చంద్రశేఖర్, నూకతోటి మస్తానమ్మ ఈశ్వరరావు, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమైక్య అధ్యక్షులు మండవ జయంతి బాబు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి అడకా స్వాములు, సంతనూతలపాడు మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు పాల్గొన్నారు.



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్